నీటిఎద్దడి నివారణ చర్యలపై ఎమ్మెల్యే ఆరా

గుంటి రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఏప్రిల్ 12 : మండలంలోని రాజాపురంలో తాగు నీటి ఎద్దడి నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎమ్మెల్యే విజయుడు ఆరా తీశారు. శుక్రవారం ఆయన గ్రామంలో పలు వివాహాలకు హాజరయ్యారు. అనంతరం నీటి ఎద్దడి లేకుండా ఏర్పాట్ల గురించి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌తోనూ చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఠాగూర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైస్‌ను అందించాలి : అదనపు కలెక్టర్

మిల్లులో సీఎంఆర్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

వనపర్తి, ఏప్రిల్ 12 : ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ రైస్‌ను సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ నగేశ్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని రైస్ మిల్లుల తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన ధాన్యం సకాలంలో తిరిగి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ గంటలు మిల్లులు ఆడించి సకాలంలో బియ్యం తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఆకాల వర్షాల నుంచి కేంద్రాల్లో ధాన్యం తడిచిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదా తరుగు పేరుతో అధికంగా తీసుకోవడం లాంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి శ్రీనివాస్, డీఎం సివిల్ సప్లై అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞాన దీపికలు

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేస్తున్న సాహితీ కళా వేదిక సభ్యులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 12: పుస్తకాలు విజ్ఞాన దీపికలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విన్నర్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి సాహితీ కళావేదిక ప్రతినిధులు శుక్రవారం పుస్తకాలు వితరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ పుస్తకాలు జ్ఞానానికి ప్రతీకలని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి తమ సంస్థ పక్షాన ప్రోత్సాహం ఉంటుందన్నారు. గ్రంథాలయానికి అరుదైన వంద పుస్తకాలను వితరణ చేసినట్లు తెలిపారు. వనపర్తి విద్యాపర్తిగానే గాక విజేతలపర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకుడు విజయ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, బొజ్జిబాబు, రామ్మోహన్, ఈశ్వర్, వరుణ్, భరత్ ఉన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

బస్‌షెల్టర్ లేని మల్దకల్ బస్టాండ్

మల్దకల్, ఏప్రిల్ 12 : మండలం కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ప్రయాణికుల రద్దీ రోజురోజుకు పెరిగిపోతున్నది. మల్దకల్ చౌరస్తా కూడలిగా ఎల్కూర్, మద్దెలబండ, అయిజ , గద్వాల్, గట్టు దారుల గుండా వెళ్లే ప్రయాణికులు నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. కొన్నేండ్లుగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ తాగునీటి వసతి, బస్ షెల్టర్ వసతి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులకు అనుగుణంగా ప్రతి స్టేజీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలప్పుడు మాత్రం నాయకులు హామీలు ఇస్తుంటారు. తీరా గెలిచిన తర్వాత వాటన్నింటిని మర్చిపోవడం సహజంగా మారింది. అయితే చౌరస్తాలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అదే విధంగా వివిధ గ్రామాలకు వెళ్లే వారు ప్రయాణికులు రోడ్లపై నిలిచి బస్సుల కోసం ఎండలోనే వేచి ఉండి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఎండ వేడిమికి తాళలేక వృద్ధులు, మహిళలు హోటళ్ల వద్ద తలదాచుకునే పరిస్థితి నెలకొన్నది. హోటళ్లలో కూడా తిను బండారాలు తింటేనే తప్పా తాగునీటిని ఇవ్వని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ

- ఈనెల 30వరకు గడువు
- బకాయి లేని వారే అర్హులు
- సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గద్వాలటౌన్, ఏప్రిల్ 12 : 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపాలిటీ పన్నుల చెల్లింపులో 5శాతం రాయితీని ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇందుకు ఈనెల 30వరకు గడువు విధించింది. ఈ లోపు పన్నులు చెల్లించిన వారికి మాత్రమే పన్ను మొత్తంలో 5శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర శాఖ ఆయా మున్సిపాలిటీలకు ఉత్తర్వులు జారీ చేసింది. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15,343నివాస గృహాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. నివాస గృహాల నుంచి ప్రతి ఆర్థిక సంవత్సరం ము గింపు వరకు రూ.5.30కోట్ల పన్నుల రూపంలో వసూళ్లు చేయాల్సి ఉంది. అయితే ప్రతి ఏడాది అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు మున్సిపాలిటీ అధికారులు ఆపసోపాలు పడుతుంటారు. గడువు లోగా చె ల్లించని వారికి జరిమానా విధిస్తుంటారు. దీంతో ప్రజలకు అధిక భారం పడుతుంది. ప్రజల మీద అధికభారం పడకుండా జరిమానాతోపాటు అసలులో కూడా ఆదా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్న ది. ఇందుకు ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే పన్నులను చెల్లించిన వారికి రా యితీని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ముందస్తు చెల్లిస్తే లాభం..

కనీస పన్ను వెయ్యి ఉన్న వారికి ఆపరాధ రుసుంతో రూ. 1250 నుంచి రూ.1300వరకు చెల్లించాల్సి ఉం టుంది. అదే ముందస్తుగా చెల్లిస్తే రాయితీ రూపంలో రూ.300వరకు ఆదా అయ్యే అవకాశాలు ఉంటాయని అభిప్రాయాన్ని మున్సిపాలిటీ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి ఏడాది పన్నులను సక్రంగా చెల్లించి న వారే రాయితీ పొందేందుకు అర్హులు. గతంలో మున్సిపాలిటీకి బకాయి పడిన వారికి రాయితీ పథకం వర్తించదని అధికారులు చెప్తున్నారు. అయితే పాత బకాయిలు చెల్లించి ఈ ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లిస్తే రాయితీకి అర్హులవుతారు.

11వేల గృహాలకు అర్హత..

మున్సిపాలిటీ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 15,343 గృహాలు ఉన్నాయి. వాటిలో 11వేల గృహాలు 5శాతం రాయితీ పొందేందుకు అర్హత సాధించాయి. అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ కోరారు. రాయితీపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముఖ్య కూడళ్ల లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేపట్టామన్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు.

మాజీ ఐఏఎస్‌కు కృతజ్ఞతలు

వనపర్తి టౌన్, ఏప్రిల్12 : అయోధ్య రాముడికి బంగారు రామాయణాన్ని కానుకగా అందజేసిన మధ్యప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణకు శుక్రవారం ప్రకటనలో ఉమ్మడి పాలమూరు జిల్లా వాల్మీకి సంఘం కన్వీనర్ మండ్ల దేవన్ననాయుడు కృతజ్ఞతలు తెలిపారు. 500బంగారు పేజీలతో రామాయణ గ్రంథాన్ని కానుకగా అందజేసిన ఐఏఎస్ అధికారికి దేశంలోని వాల్మీకుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కేంద్రం వాల్మీకి మహర్షి జయంతిని జాతీయ పండుగగా ప్రకటించాలని, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

మట్టి తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లు పట్టివేత

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 12: అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ఉదండాపూర్, పెద్దదిన్నె గ్రామ శివారులో అనుమతి లేకుండా ప్రభుత్వానికి సంబంధించిన మట్టిని అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, ఎనిమిది మంది డ్రైవర్లపై కేసు నమోదు చేశామని చెప్పారు.

బ్రిడ్జి ఎత్తు పెంచాలంటూ..

- రాజోళి మండల రైతుల ఆందోళన
- పనులను పరిశీలిస్తామన్న ఎంపీ రాములు

వంతెన వద్ద నిరసన తెలుపుతున్న రాజోళి రైతులు

రాజోళి, ఏప్రిల్ 12 : రాజోళి మండలంలో భారత్‌మాల జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. కాగా రాజోళి నుంచి శాంతినగర్‌కు వెళ్లే రహదారిపై ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జ్ ఎత్తును పెంచాలంటూ రైతులు నాలుగు నెలలుగా నిరసన చేస్తూనే ఉన్నారు. ఈక్రమంలో రైతులు శుక్రవారం రహదారి పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న రహదారి అధికారి డీపీఎం రవిచంద్ర అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల (ఎన్‌హెచ్ఏ) నుంచి తమకెలాంటి అదేశాలు రాలేదని చెప్పడంతో స్థానికులు మండిపడ్డారు. తమకు ఇబ్బందులు కలిగేలా పనులు చేపడితే నిరసనలు చేపట్టి పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతులను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి ఎత్తును 4 మీటర్ల నుండి 8మీటర్లకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. తాము ఇంత హెచ్చరిస్తున్నా పనులు చేపట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైతులు ఎంపీ రాములుకు ఫోన్‌లో సమస్యను వివరించగా ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అక్కడ జరుగుతున్న భారత్‌మాల పనులను త్వరలోనే పరిశీలిస్తానని చెప్పినట్లు రైతులు తెలిపారు. ఎంపీ వచ్చి పరిశీలించే వరకు పనులు చేపడితే అడ్డుకుంటామని రహదారి అధికారులకు రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో రాజోళి గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి విరిగిన కాలు

ఉపాధి పనులు చేస్తూ కిందపడ్డ ఈరన్నగౌడ్

అయిజ రూరల్, ఏప్రిల్ 12: మండల పరిధిలోని సంకాపురంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా కూలీ గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. ఉపాధి కూలీలు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన ఈడిగి ఈరన్నగౌడ్ రోజు మాదిరిగానే పెద్దబావి చెక్ డ్యాం వద్ద పూడికతీత పనులకు వెళ్లాడు. మట్టిపెల్లల మీద నిలబడి పని చేస్తున్న క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. దీంతో ఆయనకు రెండుచోట్ల కాలు విరిగింది. విషయాన్ని క్షేత్రసహాయకుడు ఉత్తనూరయ్య, సీనియర్ మేటీ నాగరాజు టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి వెళ్లి ఈరన్నగౌడ్‌ను కర్నూలు ప్రయివేట్ దవాఖానకు తరలించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు అశోక్ తె లిపారు. ప్రభుత్వపరంగా బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ఆరో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించిన కౌన్సిలర్ భర్త రవీందర్‌రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 12 : పట్టణంలోని 6వ వార్డులో కొంతకాలంగా లోవోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని దృష్టికి వార్డు కౌన్సిలర్ సంధ్యారవీందర్‌రెడ్డి తీసుకెళ్లారు. చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి కాలనీవాసులకు విద్యుత్ సమస్యలు తొలగించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ మద్దిగట్ల బాలకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెంటన్నయాదవ్, రవికుమార్, రవికుమార్ రెడ్డి, రామకృష్ణ, నందిశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి

పట్టణ శివారులో మట్టి తవ్వకాల ప్రదేశాలను పరిశీలిస్తున్న ఐక్యవేదిక, సీపీఐ నాయకులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 12 : మట్టి మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక , సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఐక్యవేదిక, సీపీఐ నాయకులు వనపర్తి పరిసర ప్రాంతాల్లో మట్టి తవ్వకాల ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో మరో ఐదేండ్ల తర్వాత వనపర్తిలో చుట్టు కొండలు ఉండేవి దాని చుట్టూ అడవి ఉండేదని చెప్పుకునే దౌర్భాగ్యం కలుగుతుందన్నారు. దీనికి ముఖ్య కారణం మట్టి, ఇసుక , కట్టెల మాఫియా ఈ మూడు మాఫియాలు కలిసి ప్రకృతిని నాశనం చేస్తున్నాయని , దీనిని పట్టించుకునే నాథుడే లేర ని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిసరాల్లోని పీర్లగుట్ట వెనకాల 974 సర్వే నెంబర్‌లో 1000 నుంచి 1500 టిప్పర్ల వరకు తవ్వి ప్లాట్లు వేసుకున్నారని, అదేవిధంగా మొబ్బుగుట్ట ప్రాంతాన్ని లేకుండా చేస్తున్నారని, అక్కడికి వెళ్లి తాసీల్దార్‌తో ఫోన్‌లో వివరాలు అడగగా అది ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌కు ఇ చ్చామని సమాధానం చెప్పారు. కానీ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ వారికి 471 సర్వే నెంబర్‌లో ప్లాట్లు ఇచ్చారని అడగా నాకు తెలియదు మైనింగ్ అధికారులను అడగాలని సమాధానం ఇచ్చారన్నారు. దీని బట్టి చూస్తే అధికారుల మధ్య సమన్వయం లేక మాఫియా ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్నారు. కలెక్టర్ దీనిని పరిశీలించి సరైన చర్యలు తీసుకోవాలని, ప్రజల సొమ్మును కాపాడాలని అఖిలపక్ష ఐక్యవేదిక , సీపీఐ తనపున డిమాండ్ చేస్తున్నామని కోరారు. పరిశీలించిన వారిలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీశ్‌యాదవ్, సీపీఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, శివ, రమేశ్, అరవింద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణకు అవకాశం

చిన్నంబావి, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఓటరు జాబితాలో తప్పులను సరి చూసుకోవాలని ఎంపీవో రామస్వామి ప్రజలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఓటరు లిస్ట్‌లో తమ పేర్లు లేకపోతే వెంటనే గ్రామంలోని బీఎల్‌వోలు, తాసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పేర్లు మిస్సింగ్ అయిన ఓటర్లు ఈ నెల 15లోగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత: కేసు నమోదు

పట్టుబడిన బియ్యం లోడ్ ఆటో

అయిజ రూరల్, ఏప్రిల్ 12: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ స్టేజీ సమీపంలో శుక్రవారం రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై విజయ భాస్కర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పరశురాం అనే వ్యక్తి రాజోలి మండలం మాన్‌దొడ్డి నుంచి సుమారు నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకొన్నామని,అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు
- సరైన పత్రాలు లేని 28 వాహనాలు సీజ్

గోపాల్‌పేటలోని రాంనగర్ కాలనీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గోపాల్‌పేట, ఏప్రిల్ 12 : ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని హనుమాండ్ల గడ్డ, రామ్‌నగర్ కాలనీలో శుక్రవారం వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 40మంది పోలీస్ సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రత ల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించినట్లు తెలిపారు. నేర రహిత గ్రామాలుగా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాంనగర్ కాలనీ పరిధిలో ఎలాంటి పేపర్లు, సరైన నెంబర్ ప్లేట్లు లేని 28 వాహనాలను సీజ్ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ నాగభూషణరావు, ఎస్సై హరిప్రసాద్ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

15 నుంచి ఎస్ఏ2 పరీక్షలు

అయిజ, ఏప్రిల్ 12 : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈనెల 15వ తేదీ నుంచి సంగ్రహణాత్మక మూల్యాంకనం(ఎస్ఏ)-2 పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం టైం టేబుల్ విడుదల చేసిందని ఎంఈవో నర్సింహులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 9వరకు చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే డీసీఈబీ ద్వారా ఆయా పాఠశాలలకు ప్రశ్నపత్రాలు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈనెల 22వరకు పరీక్షలు నిర్వహించి, 23న తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొందని తెలిపారు.

ఇంటి బిల్లులు సకాలంలో చెల్లించాలి

పాన్‌గల్, ఏప్రిల్12 : ఇంటి బిల్లులు సకాలంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి పరశురాములు, కారోబార్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కేతేపల్లి గ్రామంలో వాడవాడలా తిరుగుతూ ఇంటి యజమానులతో ఇంటి బిల్లుల విషయంలో చర్చించారు. ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తెలిపారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆర్ఎంపీ

ఆత్మకూరు, ఏప్రిల్ 12 : మండలంలోని మూలమల్లలో ఉపాధి కూలీలకు ఆర్ఎంపీ వెంకటేశాచారి నేతృత్వంలో శుక్రవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ మాట్లాడుతూ ఎండలు దృష్ట్యా కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు అధికంగా తాగాలని, వాంతులు, విరోచనాలు కలిగినా వెంటనే దగ్గరలోని దవాఖానను సంప్రదించాలని సూచించారు. పనులు నిర్వహించేటప్పుడు అప్పుడప్పుడు నీడమాటున ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, ఎల్లన్న, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆర్ఎంపీ వెంకటేశాచారిని అభినందించారు.

కష్టపడి చదివితే సమాజంలో గుర్తింపు

- మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

విద్యార్థి, తల్లిదండ్రులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

పెబ్బేరు, ఏప్రిల్ 12 : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి సమాజంలో గుర్తింపు పొందాలని పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అన్నారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో సీట్లు సంపాదించుకున్న నేపథ్యంలో వారిని, వారి తల్లిదండ్రులను శుక్రవారం ఆమె ఘనంగా సన్మానించారు. మేఘవర్షిత, గాయత్రి, రాంచరణ్, జశ్వంత్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

చిన్నతాండ్రపాడులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న టోర్నీ నిర్వాహకులు

అయిజ రూరల్, ఏప్రిల్ 12: సత్యమాంబ కల్యాణమహోత్సవం సందర్భంగా మండలంలోని చిన్నతాండ్రపాడులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం గ్రామస్తులు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో సాగర్ టీం ఎల్కూరు మొదటి బహుమతిగా రూ.20వేలు, ప్రిన్స్‌టీం (ఎస్సీకాలనీ), ఎల్కూర్ రెండో బహుమతిగా రూ.10వేలను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్ నాయుడు, గాలిరెడ్డి, హనుమంతునాయుడు, సత్యం, బుడ్డన్న, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గట్టు-మాచర్ల రోడ్డు మధ్యలో బోర్‌ను పరిశీలిస్తున్న ఎంపీవో మహేశ్, పీఎస్ శివశంకర్

గట్టు, ఏప్రిల్ 12 : జూరాలలో నీటి నిల్వ రోజురోజుకూ తగ్గిపోవడంతో రాబోయే రోజుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాత తాగు నీటి పథకాలపై దృష్టి పెట్టారు. అవసరమయ్యే చోట బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. పూడికపోయిన బోర్లను ఫ్లషింగ్ చేయిస్తున్నారు. చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. కాగా పాత తాగునీటి సరఫరా కనెక్షన్లకు మిషన్ భగీరథ కలెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేయాలనే సంకల్పంలో అధికారులు ఉన్నారు. కాగా మిషన్ భగీరథ నీటి సరఫరా ఈనెలాఖరు వరకే జరగవచ్చనే ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అధికారులు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు డ్యాన్స్ పోటీలు

పెబ్బేరు, ఏప్రిల్ 12: అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పెబ్బేరులోని అంబేద్కర్‌నగర్‌లో శనివారం డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ యుజన సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10,016, రెండో బహుమతిగా రూ.5,016, మూడో బహుమతిగా రూ.3,016 నగదును అందజేయనున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 9949232367, 7893448823 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

FINANCIAL SERVICES
★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు